ఎంఎస్ఎఫ్ రాయలసీమ అధ్యక్షులుగా నరేష్

ప్రజాశక్తి-పీలేరు

మాల విద్యార్థి ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) రాయలసీమ జిల్లాల అధ్యక్షుడిగా మలతోటి నరేష్ ఎన్నికయ్యారు. మాల మహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ యమలా సుదర్శనం అధ్యక్షతన సోమవారం తిరుపతిలో మాల మహానాడు రాయలసీమ జిల్లాల కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కలికిరి మండలం, అద్దవారిపల్లెకి చెందిన మలతోటి నరేష్ ను మాల విద్యార్థి సంఘం రాయలసీమ జిల్లాల అధ్యక్షుడుగా నియమిస్తూ ఆ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయ సాధనకు తాను ఒక సైనికుడిలా పని చేస్తానని, మాల జాతి అభ్యున్నతి కోసం శక్తివంచన లేకుండా శ్రమిస్తానని తెలియజేశారు. మాల విద్యార్థులు, పేద విద్యార్థుల హక్కుల కోసం పోరాటం చేస్తానని, మాల విద్యార్థుల్లో విద్య, సాధికారతను పెంపొందించేలా పని చేస్తానని పేర్కొన్నారు. మాల విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లను పరిష్కరించడానికి పోరాటం చేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో తనను ఈపదవి ఎంపిక చేసిన మాల మహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ యమలా సుదర్శనంకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో
భారీ అగ్ని ప్రమాదం

మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

మంటల్లో కాలిపోయిన విలువైన భూములకు సంబంధించిన రెవెన్యూ డాక్యుమెంట్లు, పట్టాదార్ పాసుపుస్తకాలు

మంటల్లో దగ్ధమైన ఫర్నిచర్లు, ఫ్యాన్లు

- కీలక రికార్డులు దగ్ధం
- ఘటనపై ప్రభుత్వం సీరియస్, విచారణకు ఆదేశం
- ఫైళ్లు దగ్ధంపై తీవ్రంగా స్పందించిన సిఎం చంద్రబాబు
- పోలీసుల అదుపులో జూనియర్ అసిస్టెంట్
- ఆర్‌డిఒ, తహశీల్దార్, ఉద్యోగుల ఫోన్లు సీజ్
- మదనపల్లెకు చేరుకున్న డిజిపి, సిఐడి చీఫ్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం అర్ధరాత్రి భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ నేపథ్యంలో అగ్నిప్రమాదమా? కుట్రపూరితమా? అనే అంశంపై విచారణకు సిఎం చంద్రబాబునాయుడు ఆదేశించారు. ఈ ఘటనలో ఉద్దేశపూర్వకంగానే భూముల దస్త్రాలు తగుల బెట్టారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఐదేళ్ల క్రితం నూతనంగా నిర్మించిన భవనంలో అగ్ని ప్రమాదం సంభవించడంపై పలు అనుమానాలు, విమర్శలు వెళువెత్తుతున్నాయి. సెక్షన్ 22ఎ విభాగం, కంప్యూటర్ సెక్షన్‌లో పూర్తిగా ఫైళ్లు దగ్ధమయ్యాయి. అర్ధరాత్రి మంటలు వ్యాపించడంతో రాత్రి విధుల్లో నైట్ వాచ్‌మెన్‌గా ఉన్న నిమ్మనపల్లె మండలం అగ్రహారంకు చెందిన విఆర్ఎ రమణ మంటలను గమనించి నిమ్మనపల్లె డిప్యూటీ తహశీల్దార్ తపశ్వినికి సమాచారం అందించాడు. ఆ వెను వెంటనే ఆమె మదనపల్లె ఆర్‌డిఒ సిసి మణికి సమాచారం ఇచ్చారు. ఆయన ఫైర్ సిబ్బందికి సమాచారం అం దించాడు. అగ్నిమాపక అధికారి శివప్ప సిబ్బందితో సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని ఎగిసి పడుతున్న మంటలను అదుపు చేశారు. అప్పటికే భవనంలోని పలు రికార్డులు, డాక్యుమెంట్లు, కంప్యూటర్లు, ఫర్నిచర్ దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న మదనపల్లె డిఎస్‌పి ప్రసాద్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద విషయాన్ని కలెక్టర్, ఎస్‌పిల దృష్టికి తీసుకెళ్లారు. సోమవారం ఉదయాన్నే కలెక్టర్ చామకూరి శ్రీధర్, ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు, ఎఎస్‌పి రాజ్‌కుమార్ ఆఘమేగాల మీద మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. అప్పటికే చేరుకున్న క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్, సిఐడి, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు విచారణ మొదలు పెట్టాయి. కార్యాలయంలోని సిసి కెమెరా పుటేజీని స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం అయినప్పటికి రాత్రి 10.30 గంటల వరకు విధుల్లో ఉన్న జూనియర్ అసిస్టెంట్ (కంప్యూటర్ ఆపరేటర్) గౌతమ్ తేజను పోలీసులు అదుపులోకి తీసుకుని ఏమి జరిగిందనే దానిపై విచారణ చేపట్టారు. జిల్లా స్థాయి ఇన్వెస్టిగేషన్ అధి కారులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తుండగానే ప్రత్యేక హెలికాప్టర్‌లో డిజిపి ద్వారకా తిరుమలరావు, సిఐడి చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్ సాయంత్రానికి మదనపల్లెకు చేరుకున్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని లోతైన, సమగ్ర విచారణ చేపట్టారు. మదనపల్లె ఆర్‌డిఒ, తహశీల్దార్, ఉద్యోగుల ఫోన్లను అధికారులు సీజ్ చేశారు.

సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద గుమిగూడిన ప్రజలు

సబ్ కలెక్టర్ కార్యాలయానికి ఘన చరిత్ర

మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయానికి ఘన చరిత్ర ఉంది. బ్రిటీష్ వారి పరిపాలనా కాలం నాటినుండే మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాల యం ఆసియా దేశాలలోనే అతి పెద్ద రెవె న్యూ డివిజన్‌గా పేరు గడించింది. డివి జన్ పరిధిలో 31 మండలాలు ఉండేవి. అన్ని మండలాలకు చెందిన రెవెన్యూ భూముల రికార్డులు ఇక్కడే ఉండేవి. సబ్ కలెక్టర్ స్థాయిలో ఐఎఎస్ అధికారులే ఇక్కడ పాలనా బాధ్యతలు చేపట్టేవారు. ఇంతటి ఘన చరిత్ర ఉన్న మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఇంతవరకు ఒక చిన్న సంఘటన కూడా జరగకపోవడం గమనార్హం. అలాంటిది ఐదేళ్ళ పాలనలో ఇక్కడ ఐఎఎస్ అధికారులు కాకుండా కేవలం తహశీల్దారు నుండి ఆర్‌డిఒలుగా ఉద్యోగోన్నతి పొందినవారు విధులు నిర్వర్తించారు. గత ఐదేళ్ల వైసిపి ప్రభుత్వ పాలనలో జిల్లాల పుర్విభజన జరగడంతో మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లో 11 మండలాలే మిగిలాయి. తంబళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గ మండ లాలతో పాటు పీలేరు నియోజక వర్గంలోని వాల్మీకిపురం, కలికిరి మండలాలు మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లోకి వచ్చాయి. కాగా ఎన్‌డిఎ కూటమి ప్రభు త్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇక్కడున్న ఆర్‌డిఒను బదిలీ చేసి ఐఎఎస్ అధికారి మేఘ స్వరూప్‌కు మదనపల్లె సబ్ కలెక్టర్‌గా నియమిస్తూ శనివారం రాత్రి ప్రభుతం ఉత్తర్వులు జారీ చేసింది. మేఘ స్వరూప్ సోమవారం బాధ్యతలు తీసుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి సబ్ కలెక్టర్ కార్యాలయం అగ్ని ప్రమాదానికి గురికావడం పలు అనుమానాలకు తావిస్తోంది.

పోలీసుల అదుపులో జూనియర్ అసిస్టెంట్ గౌతమ్

అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ 25 కీలక ఫైళ్లు కాలిపోయాయని చెప్పారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో 22 (ఎ) వంటి పలు సబ్జెక్టులు చూసే విభాగంలో ఈ అగ్ని ప్రమాదం జరిగిందని తెలిపారు. ఈ అగ్ని ప్రమాదంపై అన్ని కోణాలలో దర్యాప్తు చేస్తామని తెలిపారు. ఈ పరిశీలనలో ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు, ఎఎస్‌పి రాజ్‌కమల్, డిఆర్‌ఒ సత్యనారాయణరావు, మదనపల్లి ఆర్‌డిఒ హరిప్రసాద్, రాయచోటి ఆర్‌డిఒ రంగస్వామి, రాజంపేట ఆర్‌డిఒ మోహన్ రావు పాల్గొన్నారు.

పోలీసు జాగిలాన్ని కార్యాలయంలోకి తీసుకెళ్తున్న డాగ్‌స్క్వాడ్

మదనపల్లె ఘటన యాక్సిడెంట్ కాదు.. ఇన్సిడెంట్

- డిజిపి ద్వారకా తిరుమలరావు

సంఘటనకు సంబంధించి మీడియాతో మాట్లాడుతున్న డిజిపి ద్వారకా తిరుమలరావు

అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఘటన యాక్సిడెంట్ కాదని, ఇన్సిడెంట్‌గా అనిపిస్తోందని డిజిపి ద్వారకా తిరుమలరావు అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ఆయన సోమవారం సాయంత్రం సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకొని, ఘటనపై ఆరా తీశారు. అక్కడి పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం మీడియాతో మాటా ్లడారు. ఆదివారం అర్ధ రాత్రి సుమారు 11.30 గంటలకు మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో అగ్నిప్రమాదం జరిగి ందన్నారు. మూడు గంటల పాటు పరిశీలించిన తర్వాత అది యాక్సిడెంట్ కాదు.. ఇన్సిడెంట్‌గా భావిస్తున్నామన్నారు. 22 ఎ భూముల రికార్డులున్న గదిలో ఫైర్ ఇన్సిడెంట్ జరిగిందని చెప్పారు. కీలక దస్త్రాలున్న విభాగంలో ఈ ఘటన చోటు చేసుకోవడం అనుమానాలకు తావిస్తోందని తెలిపారు. ఘటన సమాచారం ఆర్‌డిఒకు తెలిసి ందని, కలెక్టర్‌కు సమాచారం ఇవ్వలేదని చెప్పారు. ఘటన విషయం తెలుసుకున్న సిఐ కూడా ఎస్‌పి, డిఎస్‌పిలకు సమాచారం ఇవ్వకపోవడం అనుమానాలకు తావిస్తోందని పేర్కొ న్నారు. రెవెన్యూ, పోలీసు ఉన్నతాధికారుల అలసత్వం కనిపి స్తోందని తెలిపారు. కార్యాల యంలో షార్ట్ సర్క్యూట్ జరిగేందుకు అవకాశమే లేదని విచారణలో తేలిందన్నారు. ఇక్కడ వోల్టేజ్ తేడాలు లేవని అధికారులు చెబుతున్నారని, ఇదే విషయాన్ని ఫోరెన్సిక్ వాళ్లు కూడా చెప్పారని పేర్కొన్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయం కిటికీ బయట అగ్గిపుల్లలు కనిపించాయని తెలిపారు. కార్యాలయం బయట కూడా కొన్ని ఫైళ్లు కాలిపోయాయన్నారు. ఇవన్నీ అనుమానాలను మరింత పెంచు తున్నాయని చెప్పారు. ఇటీవల సాక్ష్యాలను నాశనం చేసే ఘటనలు కొన్ని జరిగాయని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో ఆ దిశగానూ దర్యాప్తు ప్రారంభించామని, కేసు దర్యాప్తునకు 10 బృందాలను ఏర్పాటు చేశామని చెప్పారు. కేసు సిఐడికి బదిలీ చేసే అంశంపై మంగళవారం లేదా బుధవారం నిర్ణయం తీసుకుంటామన్నారు. యాక్సిడెంట్ కాదు.. కుట్రో కాదో విచారణలో తేలుస్తాఃమని తెలిపారు. దీనిపై ప్రభుత్వం చాలా సీరియస్‌గా ఉందన్న ఆయన పోలీసు శాఖ కూడా దీనిని తీవ్రంగా పరిగణిస్తోందని చెప్పారు. ఎలాంటి సమాచారం ఉన్నా వెంటనే పోలీసులకు అందించాలని విజ్ఞప్తి చేశారు.

ఆశలపద్దు..!

- కడప-బెంగళూరు రైల్వే లైన్‌పై ఆశలు
- ఉక్కు పరిశ్రమకు ఊతమిచ్చేనా?
- వెనుకబడిన ప్రాంతాల నిధులపై నిరీక్షణ
- నేడు కేంద్ర బడ్జెట్

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

కేంద్ర బడ్జెట్-2024-25 సమర్పణకు సర్వం సిద్ధమైంది. కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టనున్నారు. జిల్లాలోని విమాన, రైల్వే, ఉక్కు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధుల పెండింగ్ వంటి సమస్యలకు నిధుల కేటాయింపులపై అందరిదృష్టి నిలిచింది. ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, పెండింగ్ రైల్వేలైన్లు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధులు, ఉపాధి హామీ పథకం నిధుల పెంపు, రైతుల ఆదాయం రెట్టింపు, మధ్య తరగతి నుంచి 4.6 కోట్ల మంది నుంచి 16 కోట్ల మంది దారిద్ర్యంలోకి జారుకున్న నేపథ్యంలో పేదల అభ్యున్నతి, నిత్యావసరాల ధరల తగ్గింపు వంటి సమస్యలు పేదలను చుట్టుముట్టడం తెలిసిందే. ఇటువంటి సామాన్యులకు సంబంధించిన అంశాలకు ప్రాధాన్యత లభించనుందా లేదా అనే అంశంపై ఆసక్తి నెలకొంది. తాజా బడ్జెట్ ప్రత్యేకతను సంతరించుకుంది.

ప్రధానంగా రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న విధంగా జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, సుమారు రూ.1050 కోట్ల వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధుల పెండింగ్, కడప నుంచి విజయవాడకు రైల్వేలైన్, కడప-బెంగళూరు రైల్వేలైన్లకు కేటాయింపులపై ఆసక్తి నెలకొంది. వీటిపై పదేళ్లుగా ప్రజానీకానికి ఎదురుచూపులు తప్పడం లేదు. గత పది బడ్జెట్ల ఆర్థిక సర్వే, ఎటిఆర్ నివేదికల్లో ఉక్కు పరిశ్రమ ప్రస్తావనే లేకపోవడంతో ప్రజాగ్రహం పెల్లుబుకుతోంది. తాజా బడ్జెట్‌లోనైనా ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, మైన్స్ కేటాయింపు, రాత్రిపూట విమానాల ల్యాండింగ్, పెండింగ్ రైల్వే ప్రాజెక్టులకు నిధులు, కడప రైల్వేస్టేషన్ ఆధు నికీకరణ కేటాయింపులు చేయాల్సి ఉంది. కడప-బెంగళూరు రైల్వే ప్రాజెక్టు అలైన్‌మెంట్ మార్పును కోరుతూ గత ప్రభుత్వం లేఖ రాసిన నేపథ్యంలో కేటాయింపులపై ఉత్కంఠ నెలకొంది. సాధారణ బడ్జెట్‌లో రైల్వేబడ్జెట్‌ను కలిపేయడంతో రైల్వే ప్రాజెక్టుల కేటాయింపుల్లో ప్రాధాన్యత దక్కుతుందనే ఆశించిన వారికి నిరాశే మిగిలింది.

కడప-బెంగళూరు, ప్రొద్దుటూరు-కంభం, భాకరాపేట-గిద్దలూరు, ఓబులవారిపల్లి- వాయల్పాడు పెండింగ్ ప్రాజెక్టులుగానే ఉన్నాయి. కడప-బెంగళూరు ప్రాజెక్టు రెండవ దశలో భాగంగా పెండ్లిమర్రి నుంచి రాయచోటి మీదుగా చిత్తూరు జిల్లా వరకు చేపట్టాల్సిన పనులు నిలిచిపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఓబులవారిపల్లి-కృష్ణపట్నం రైల్వేలైన్ ప్రారంభించినప్పటికీ, సరుకు సరఫరాకు మాత్రమే పరిమితం కావడం ఆందోళన కలిగిస్తోంది. ప్రొద్దుటూరు-కంభం, భాకరా పేట-గిద్దలూరు, ఓబులవారిపల్లి-వాయల్పాడు రైల్వేలైన్ ప్రతి పాదనల దశ దాటకపోవడం నిరుత్సాహాన్ని కలిగిస్తోంది. కడప- బెంగళూరు, కడప-విజయవాడ లైన్ కేటాయింపు ఆశలపైనే అందరిదృష్టి నిలిచింది. నందలూరు రైల్వే లోకోషెడ్‌కు ప్రత్యా మ్నాయం, షిర్డీకి రైలు, తిరుపతి-మచిలీపట్నం రైలు కడప మీదుగా వెళ్లే అవకాశం కల్పించాలనే డిమాండ్లపై ఆసక్తి నెలకొంది. కడప-విజయవాడ, కడప-బెంగళూరు రైలు మార్గా లకు నిధుల కేటాయింపులు చేయాలని ప్రజానీకం ఎదురు చూస్తోంది. ఉపాధి హామీ నిధుల పెంపు, వేతన శ్లాబుల పెంపు, మహిళా సంక్షేమం వెరసి సామాన్యుల జీవన ప్రమాణాల, వ్యవసాయ కేటాయింపుల పెంపు వంటి సామాజిక పురోగమిత అంశాలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

'మదనపల్లె ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపించాలి'

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన అగ్ని ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని పలు పార్టీలకు చెందిన నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఆయా పార్టీల నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో కీలకమైన తపాలా విభాగం, 22(ఎ) విభాగంలో రికార్డులు కాలి బూడిద అయ్యాయిన్నారు. ఉద్దేశ్య పూర్వకంగా అగ్ని ప్రమాదం జరిగిందనే అనుమానాలు ఉన్నాయిని పేర్కొన్నారు. దీనిపై అధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలు బహిర్గతం చెయ్యాలని కోరారు. టిడిపి జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్మోహన్‌రాజు, రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు శ్రీరామ్ చిన బాబు, రాజంపేట అధికార ప్రతినిధి ఆర్‌జె వెంకటేష్ మాట్లాడుతూ మాజీ మంత్రి పెద్దిరెడ్డి దోచుకున్న భూములకు రికార్డులు లేకుండా కుట్ర పూరితంగా తగలబెట్టేందుకు ఈ ప్రమాదాన్ని సృష్టించారని ఆరోపించారు. పెద్దపంజాణి రాగానిపల్లె వద్ద లాండ్ టైటిల్ యాక్ట్ కింద పేదలకు చెందిన 930 ఎకరాలు పోగేసుకుని వాటికి లాండ్ టైటిల్ యాక్ట్ అమలు చేసి సెటిల్‌మెంట్ చేసుకోవడానికి పెద్దకుట్ర పన్నారన్నారు. పుంగనూరు మండలం ఈడిగపల్లె వద్ద నేతిగుట్లపల్లె ప్రాజెక్టు కోసం అని మభ్యపెట్టి పేదలకు చెందిన 800 ఎకరాల డికెటి ల్యాండ్ కబ్జా చేశారన్నారు. మదనపల్లె మెడికల్ కాలేజ్ నిర్మాణం కోసమని రాచవేటివారిపల్లె పంచాయతీ, కొత్తవారిపల్లె పంచాయతీలో పేదలకు చెందిన 800 ఎకరాలకు పైగా పోగేసుకున్నారని ఆరోపించారు. మదనపల్లెకు సబ్ కలెక్టర్ రానున్న నేపథ్యంలో భూ కబ్జాల భాగోతం బయట పడుతుందనే ఒకే ఒక్క కుట్రకోణంతో అగ్నిప్రమాదాన్ని సృష్టించి కీలకమైన ఫైళ్లను తగలబెట్టారని తెలియజేశారు. లోతైన దర్యాప్తు చేపట్టి ఇంకా వైసిపి కనసన్నల్లో పనిచేస్తున్న అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జనసేన నాయకులు శ్రీరామ రామాంజులు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ రెడ్డి సాహెబ్, సిపిఐ కృష్ణప్ప, మురళి, ఎఐటియుసి కృష్ణమూర్తి, ఎమ్మార్పీఎస్ నరేంద్ర ఇతర ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ స్వార్ధ ప్రయోజనాల కోసమే ఎంతో ఘన చరిత్ర ఉన్న మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని అగ్నికి ఆహుతి చేశారని ఆరోపించారు.

కలికిరి : మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో అగ్నిప్రమాదాంపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని విసికె పార్టీ రాష్ట్ర కార్యదర్శి పాలకుంట శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రాజంపేట అర్బన్ :రాష్ట్రంలోని అన్ని రెవెన్యూ కార్యాలయాలకు ప్రభుత్వం పటిష్టమైన భద్రత కల్పించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ భూములు భారీ స్థాయిలో ఆక్రమణలకు గురయ్యాయన్నారు.

లక్కిరెడ్డిపల్లి :సబ్ కలెక్టర్ ఆఫీస్ అగ్నిప్రమాదంపై అనేక అనువానాలు ఉన్నాయని భూ కబ్జాదారులు తమ యొక్క బాగోతం బయటపడుతుందని ఉద్దేశంతో తప్పించుకునేందుకు ఇలాంటి కుట్ర చేసి ఉంటారనే అనుమానాలు వ్యక్తమవు తున్నాయని సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు అంకన్న అన్నారు.

'విద్యార్థి సంఘాలపై ఆరోపణలు తగవు'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

విద్యార్థుల హక్కుల కోసం పోరాడే విద్యార్థి సంఘాల నేతలపై ఆరోపణలు చేయడం హేయమైన చర్య అని విద్యార్థి సంఘాల నేతలు అన్నారు. సోమవారం ఆర్అండ్‌బి అతిధి గృహం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌యు, ఎఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ శనివారం పట్టణంలోని ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు టిడిపి ఇన్‌ఛార్జి బాలసుబ్రమణ్యంకు విద్యార్థి సంఘాలపై ఆరోపణలు చేస్తూ వినతి పత్రం ఇవ్వడాన్ని తాము స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థి సంఘాల నేతలు ప్రయివేటు పాఠశాలలపై దౌర్జన్యాలు, వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ప్రయివేటు విద్యా సంస్థల యాజమాన్యాలపై ఏ విద్యార్థి సంఘాలు దౌర్జన్యాలు, వేధింపులకు పాల్పడ్డారో బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. అలాంటి సంఘాలను ప్రతిఘటించాలని అందుకు వామపక్ష విద్యార్థి సంఘాలు ముందు ఉంటాయని తెలిపారు. వామపక్ష విద్యార్థి సంఘాలు ఒక భావజాలంతో విద్యార్థుల హక్కుల కోసం, సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. ప్రయివేటు పాఠశాలల్లో ఐఐటి పేరుతో వేల రూపాయలు విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద జలగల్లా పీల్చి రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తున్నారని ఆరోపించారు. బిఇడి ఉపాధ్యాయులను నియమించుకోవాలని, ప్రతి పాఠశాలకు క్రీడామైదానం ఉండాలని ప్రభుత్వ నిబంధనలు ఉన్నా ప్రయివేటు విద్యా సంస్థలు నిబంధనలు తుంగలో తొక్కి ప్రవర్తిస్తున్నారన్నారు. ఐఐటి బోధించడానికి ఎంఎస్సీ, ఎంఇడి అర్హత కలిగిన ఉపాధ్యాయులు మాత్రమే ఉండాలని, అలాంటి ఉపాధ్యాయులు ఏ పాఠశాలల్లో ఉన్నారో తెలపాలని ప్రశ్నించారు. సమయపాలన పాటించకుండా ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులలో మానసిక ఒత్తిడి పెంచుతున్నారన్నారు. వామపక్ష విద్యార్థి సంఘాలు విద్యార్థుల సమస్యల పట్ల పోరాటాలు మాత్రమే చేస్తాయని స్పష్టం చేశారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు నేతి నాగేశ్వర, ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బాలసుబ్రమణ్యం, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రమణ, జిల్లా సహాయ కార్యదర్శి శెట్టిపల్లి సాయికుమార్, కన్నా, చెంగయ్య, మధు, ప్రసాద్, సాయి, రాజా, సుబ్రహ్మణ్యం, రామచంద్ర పాల్గొన్నారు.

తహశీల్దార్ మహబూబ్‌బాషాకు సన్మానం

ప్రజాశక్తి-పీలేరు

తహశీల్దారుగా ఎస్.మహబూబ్ బాష నిష్పక్షపాతంగా ప్రజలకు సేవలు అందించారని పీలేరు మీడియా ప్రతినిధులు కొనియాడారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా అనంతపురం జిల్లా నుండి బదిలీపై పీలేరు తహశీల్దారుగా నియమితులైన ఆయన తిరిగి తన సొంత జిల్లాకు వెళ్లడానికి సోమవారం విధుల నుంచి రిలీవ్ అయ్యారు. స్థానిక రెవెన్యూ, సచివాలయ ఉద్యోగులు, సిబ్బందితో పాటు పీలేరు ప్రెస్ క్లబ్ తరపున ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా పీలేరు ప్రెస్ క్లబ్ తరుపున తహశీల్దారును పూలమాల, శాలువాలతో ఘనంగా సన్మానించి సత్కరించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. పీలేరు ప్రెస్ క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ తహశీల్దారుగా మహబూబ్ బాష నిజాయితీగా పని చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మల్లెల జాకీర్ హుస్సేన్, గౌరవ అధ్యక్షులు ఖాదర్‌బాష షేక్, సీనియర్ పాత్రికేయులు పఠాన్ జాకీర్ హుస్సేన్, జానం గంగిరెడ్డి, రమణా రెడ్డి, షేక్ మస్తాన్ సాహెబ్, నంద్యాల నాగరాజ, రవికిషోర్, తులసీకృష్ణ, భాను ప్రకాష్ పాల్గొన్నారు.

సమస్యలు వేగవంతంగా పరిష్కరించాలి : డిఆర్ఒ

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన వినతులను వేగవంతంగా పరిష్కరించాలని డిఆర్‌ఒ సత్య నారాయణ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రసల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఒ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా సమస్యలు పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎక్కువగా భూ సమస్యలు వస్తుంటాయని భూ సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని తెలిపారు. కార్యక్రమంలో కెఆర్ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామసుబ్బయ్య, ల్యాండ్ అండ్ సర్వే ఏడి జయరాజ్, డిఆర్ డిఎ పీడీ సత్య నారాయణ, డిపిఒ ధనలక్ష్మి, డ్వామా పీడీ మద్దిలేటి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇ సురేష్ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అన్నమాచార్య అధ్యాపకురాలికి డాక్టరేట్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల ఇసిఇ విభాగంలో సహాయ ఆచార్యురాలుగా పనిచేస్తున్న షేక్ ఫయాజ్ బేగమ్‌కు జెఎస్ యూనివర్సిటీ, ఉత్తరప్రదేశ్ వారిచే పిహెచ్‌డి ప్రదానం చేసిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.ఎం.వి.నారాయణ సోమవారం తెలిపారు. ఆప్టిమైజింగ్ డేటా డెలివరీ మెకానిజమ్స్ ఫర్ ఎన్ ఎన్స్డ్ ఫర్మామెన్స్ ఇన్ 5 జీ మొబైల్ నెట్ వర్క్స్ అంశంపై పరిశోధన చేసినందుకు డాక్టరేట్ ప్రదానం చేశారన్నారు. డాక్టర్ సచిన్ సక్సేనా, ప్రొఫెసర్, ఐఐటి డిల్లీ వారి పర్యవేక్షణలో ఈ పిహెచ్‌డి చేశారని తెలిపారు. తాను చేసిన పరిశోధన 5 పైజీ మొబల్ ఉపయోగాలు ఒఎఫ్‌డిఎం సిద్ధాంతం ద్వారా త్వరగా సమాచారం త్వరగా ఇతర ప్రాంతాలకు చేరవేయడం చాలా సులభతరంగా ఉంటుందని, 5 జీలో ఉపయోగించే కొన్ని మోడ్యులేషన్స్ స్కీమ్‌ను కూడా అనుసంధానం చేశారన్నారు. 5జీ మొబైల్ నెట్ వర్క్‌ను సులభంగా ఆప్టిమైజేషన్ చేయడం సులభంగాఉంటుంద్నునారు. ఈ సందర్భంగా కళాశాల వ్యవస్థాపకులు డాక్టర్ గంగిరెడ్డి, చైర్మన్ డాక్టర్ సి.రామచంద్రారెడ్డి, వైస్ చైర్మన్ చొప్పా యల్లారెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చొప్పా అభిషేక్ రెడ్డి, ఇసిఇ విభాగాధిపతి డాక్టర్ సిహెచ్ నాగరాజు, డీన్లు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపక బృందం షేక్ ఫయాజ్ బేగమ్‌ను అభినందించారు.

మెరుగైన పారిశుధ్యానికి చర్యలు : కమిషనర్

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పట్టణంలో మెరుగైన పారిశుధ్యానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు బి.కొత్తకోట నగర పంచాయతీ కమిషనర్ పి.ఆర్.మనోహర్ పేర్కొన్నారు. సోమవారం బిసి కాలనీలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని చేపట్టారు. కాలనీలో పారిశుధ్య కార్మికుల చేత డ్రెయినేజీ కాలువలను శుభ్రం చేయించి పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పట్టణ ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, నాణ్యమైన ఆహారం తీసుకోవడం వలన వ్యాధుల బారిన పడకుండా ఉండ వచ్చని సూచించారు. దోమలు వృద్ధి చెందకుండా దోమల నివారణ మందులను స్ప్రే చేస్తున్నామని అన్నారు. ప్రతిరోజూ పట్టణంలో ఏదో ఒక ప్రాంతంలో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నామని తెలిపారు. అనునిత్యం ప్రజల శ్రేయస్సు కోసం పారిశుధ్య కార్మికులు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. పట్టణ పరిశుభ్రతలో ప్రజలు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న కమిషనర్ మనోహర్

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ షాలెట్

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

పర్యావరణను పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని ఎంపిడిఒ షాలెట్, ఎంఇఒ నారాయణ అన్నారు. సోమవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తెలుగు)లో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవుని మనుగడకు పర్యావరణం అతి ముఖ్యమైనదని, దానిని పరిరక్షించుకోవడం మనందరి బాధ్యతని తెలిపారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధు లతో అనారోగ్యం బారిన పడే అవకాశం ఉందని గుర్తు చేశారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, నాణ్యమైన ఆహారం తీసుకోవడం వలన వ్యాధుల బారిన పడకుండా ఉండ వచ్చని సూచించారు. వర్షాకాలంలో సాధారణంగా నీరు కలుషితం అవుతుందని, కాచి చల్లార్చిన నీటిని క్రమంగా తీసుకోవడం వలన అనారోగ్యం నుంచి బయట పడవచ్చునని అన్నారు. వినాయక చవితి పండుగ సందర్భంగా ఏర్పాటు చేసుకునే విగ్రహాలలో మట్టి విగ్రహాలను మాత్రమే ఉపయోగించాలని పేర్కొన్నారు. పిఒపితో తయారుచేసిన విగ్రహాలను ప్రభుత్వం నిషేధిస్తున్నాదని, ఈ విగ్రహాలను తయారు చేయడానికి పలు రకాల రసాయనాలను వాడటం వలన విగ్రహాలను నిమజ్జనం చేసే క్రమంలో జల చరాలకు, పర్యావరణానికి హాని కలుగుతుందని అన్నారు. ఈ విగ్రహాల అమ్మకాలను ప్రభుత్వం నిషేధిస్తున్నాదని పేర్కొన్నారు. మట్టి విగ్రహాలు కాకుం డా, పిఒపి విగ్రహాలను ఉపయోగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చ రించారు. పర్యావరణాన్ని పరి రక్షించ డానికి ప్రతి విద్యార్థి ఒక్క మొక్క నాటా లని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభ్యున్నతే ఎస్‌జిబి లక్ష్యం

ప్రజాశక్తి - రామసముద్రం

గ్రామీణ ప్రాంత ప్రజల ఆర్థిక అభివృద్ధే లక్ష్యంగా తమ బ్యాంకు విస్తృత సేవలను అందిస్తున్నట్లు సప్తగిరి గ్రామీణ బ్యాంక్ చైర్మన్ ప్రసాద్ తెలిపారు. సోమవారం మండలంలోని చెంబకూరు గ్రామంలోని పాత భవనం నుండి నూతనంగా నిర్మించిన భవనాన్ని రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం విశాలమైన భవనాన్ని ఏర్పాటుచేసి సేవలు సులభతరం చేసినట్లు తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఐదు వేల కోట్ల రు ణాలు అందించినట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 70 వేల ఎస్‌హెచ్‌జి గ్రూపులకు రుణాలు అందించినట్లు చెప్పారు. వ్యవసాయ రంగానికి కెసిసి లోన్ ద్వారా రూ.1600కోట్లు అందించినట్లు తెలిపారు. ఇచ్చిన రుణాలు రికవరీ 89 శాతం ఉందని తెలిపారు. గడచిన మూడు నెలల కాలంలో రూ.129 కోట్లు ప్రాఫిట్ పొందినట్లు పేర్కొన్నారు. పిఎంఇజిపి పథకం ద్వారా రైతులకు రుణాలు అందించామని, స్వగృహ పథకం ద్వారా పది లక్షల వరకు రుణాలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. 2023-24 సంవత్సరాల్లో రుణ అభివృద్ధిలో వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చామని, గోల్డ్ లోన్స్, సెల్ఫ్‌హెల్ప్ గ్రూప్ లోన్‌ను మంజూరు చేసినట్లు చెప్పారు. ఖాతాదారులకు బ్యాంకు సేవలను నిర్ణీత సమయంలో అందిస్తూ గ్రామీణ రైతుల అవసరాలను గుర్తించి సకాలంలో రుణ సదుపాయం కల్పించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు ప్రజలకు అందించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ ప్రభాకరన్, రీజనల్ మేనేజర్ ప్రకాష్ రత్న బాబు, మేనేజర్ వినోద్, కలికిరి బ్రాంచ్ మేనేజర్ సిద్దయ్య, రిటైడ్ మేనేజర్లు వెంకటరమణ రెడ్డి, హరనాథ్‌శర్మ, రెడ్డెప్ప, రామిరెడ్డి, సుధాకర్, రామ లింగారెడ్డి, రమేష్‌రెడ్డి, భవన యజమాని నూతనపాటి శ్రీనివాసులు, ఎపిఎం సుబ్రహ్మణ్యం, సంఘమిత్రాలు, ఖాతాదారులు పాల్గొన్నారు.

బ్యాంకు నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న సప్తగిరి బ్యాంక్ చైర్మన్ ప్రసాద్

ఘనంగా బోధనాభ్యాసన సామగ్రి దినోత్సవం

విద్యా సామగ్రిని ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని దలవాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఎన్‌ఇపి ఉత్సవాలలో భాగంగా రాష్ట్ర పభుత్వం నిర్వహిస్తున్న శిక్ష సమాప్తం కార్యక్రమం ఏడు రోజుల ఉత్సవాలలో భాగంగా సోమవారం బోధనా అభ్యసన సామగ్రి తయారీ దినోత్సవం ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారులు చక్రధర్‌రాజు, నాగ తిరుమలరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పిల్లలు ఎంతో ఉత్సాహంతో స్థానిక వనరులను ఉపయోగించి అనేక మెడల్స్, ప్రాజెక్ట్స్, బొమ్మలు, బోధన సామగ్రి తయారు చేశారు. ఆకులతో జంతువులు, పక్షులు, బొమ్మలు, స్పాంజితో ట్రెడ్ బేర్, మల్టీ క్యాలెండర్ కోణాలు ఎంతగానో ఆకర్షించాయి. విద్యాశాఖ అధికారులు పిల్లలను ఎంతో ఆప్యాయంగా పలకరించి ఎంతో ఉత్సాహంగా పిల్లలు చేసిన ప్రాజెక్టులను అడిగి తెలుసుకుని కొన్ని సూచనలు సలహాలు ఇచ్చారు. గణిత క్రీడలు పిల్లలతో ఆడారు. బోధన సామగ్రి తయారీ వల్ల పిల్లలు వారిలోని సృజనాత్మకతను వెలికి తీయగలమని విద్యాశాఖ అధికారులు పిల్లను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమణ, ఈశ్వరమ్మ తెలిపారు.

స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలు, పట్టుబడ్డ స్మగ్లర్లతో పోలీసు, అటవీ శాఖ సిబ్బంది

ముగ్గురు ఎర్రచందనం స్మగ్లర్లు అరెస్టు

- ఏడు దుంగలు, రెండు మోటారు సైకిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలంలోని రాయవరం గ్రామపంచాయతీలోకావలిపల్లి రాయవరం సెక్షన్ వద్ద మామిడి తోటలో 7ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకోవడంతో పాటు ముగ్గురు స్మగ్లర్లను టాస్క్ ఫోర్సు పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి రెండు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సిఐ శ్రీనివాసులు పేర్కొన్నారు టాస్క్ ఫోర్సు ఇన్‌ఛార్జి తిరుపతి జిల్లా ఎస్‌పి ఎల్.సుబ్బరాయుడు ఆదేశాలతో, టాస్క్ ఫోర్స్ ఎస్‌పి పి.శ్రీనివాస్ అధ్వర్యంలో డిఎస్‌పి చెంచుబాబు సూచన మేరకు ఆర్ఐ (ఆపరేషన్స్) ఆర్ఎస్ఐ కే.సురేష్ బాబుకు చెందిన టీమ్ ఆదివారం రాత్రి నుంచి అన్నమయ్య జిల్లా రాజంపేట సమీపంలోని సానిపాయ రేంజిలోని రాయవరం నుంచి ఎంట్రీ ఎగ్జిట్ పాయింట్లను తనిఖీలు చేపట్టారని తెలిపారు. సోమవారం తెల్లవారు జామున రెడ్డివారిపల్లి, మాచిరెడ్డిగారి పల్లి రోడ్డుకు తూర్పు వైపున ఉన్న మామిడి తోట వద్దకు చేరుకున్నారని అన్నారు. అక్కడ మూడు మోటారు సైకిళ్లపై కొందరు వ్యక్తులు కూర్చుని ఉన్నారు. వారిని చుట్టుముట్టగా, ఒక వ్యక్తి ఒక మోటారు సైకిల్‌లో పారిపోయాడని చెప్పారు. మిగిలిన ముగ్గురుని పట్టుకుని విచారించి, సమీ పంలో ఎర్రచందనం దుంగల డంప్‌ను కనుగొన్నారని తెలిపారు. అక్కడ ఉన్న ఏడు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన వారిలో అన్నమయ్య జిల్లా జిల్లేళ్లమంద పంచాయితీకి చెందిన జి.సురేష్, జి.అశోక్, మాచిరెడ్డిపల్లికి చెందిన పందిపాటి తిరు మలయ్యగా గుర్తించారని వీరిని అరెస్టు చేసి తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారని, సీఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఆపరేషన్‌లో అటవీశాఖకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-రామసముద్రం : మనస్తాపానికి గురై వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. రామసముద్రం ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాల మేరకు..మండలంలోని ఎలువనెల్లూరు పంచాయతీ ఎ.కొత్తూరు గ్రామానికి చెందిన చిన్నరామప్ప కుమారుడు శ్రీనివాసులు(50) తాగుడుకు బానిసై డబ్బులు వృధా చేస్తున్నాడని అతని భార్య మంజులమ్మతో గొడవ పడి మనస్తాపంతో పొలం వద్ద పురుగు మందు తాగాడని తెలిపారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడని తెలిపారు. ఈ సం ఘటనపై హెడ్ కానిస్టేబుల్ కిరణ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సురేష్

నాణ్యమైన గడ్డిని పశువులకు అందించాలి

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

పశువులకు సోకే సీజనల్ వ్యాధుల పట్ల పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని, నాణ్య మైన పశుగ్రాసాన్ని పశువులకు అందించాలని నిమ్మనపల్లి పశు వైద్యాధికారి డాక్టర్ సాదుసురేష్ పేర్కొన్నారు. సోమవారం కొండయ్యగారిపల్లి పంచాయతీలోని వెంకోజిగారిపల్లెలో పాడి రైతులతో సమావేశం ఏర్పాటు చేసి పశువులకు అందించే పశుగ్రాసం, దాణాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాడి రైతులు పశువులకు అందించే పశుగ్రాసం దాణాపై అప్ర మత్తంగా ఉండాలన్నారు. కుళ్ళినగడ్డి, పశువుల దాణా వాడటం వల్ల వాటిలో ఉన్న ఫంగస్ వల న పశువులు అనారోగ్యం బారినపడి మృతిచెందే అవకాశం ఉందని తెలిపారు. బాగా ఎండబెట్టి ఆరిన ఎండుగడ్డి, నాణ్యమైన పశు దాణా, కలుషితం కానీ పచ్చగడ్డిని పశువులకు అందించడం వలన పశువులలో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. మండలానికి తొమ్మిది టన్నుల మొక్కజొన్న పశుగ్రాస విత్తనాలు వచ్చాయనిఅన్ని పశు సేవ కేంద్రాలలో వీటిని అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఒక్క కిలో మొక్కజొన్న రాయితీపై రూ.17లకు ఇస్తున్నట్లు తెలిపారు. మొక్కజొన్న విత్తనాలు కావ లసిన రైతులు తమ ఆధార్ కార్డు, పాసు పుస్తకం జిరాక్స్‌లను అందించి విత్తనాలను పొందగలరని తెలిపారు.

తహశీల్దార్ కార్యాలయాలకు భద్రత కల్పించాలి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

గత రాత్రి మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలోని భూ రికార్డులు దగ్ధమైన సంఘ టనను తీవ్రమైన హెచ్చరికగా తీసుకుని తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ఆరు మండలాలలో ఉన్న తహశీల్దార్ కార్యాలయాలలోని రికార్డుల రూములకు ప్రతిష్టమైన భద్రత పెంచాలని సిపిఐ నియోజకవర్గపు కార్యదర్శి ఎస్.మనోహర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ అతిపెద్ద రెవిన్యూ డివిజన్, అనునిత్యం రాత్రింబవల్లు ట్రాఫిక్ రద్దీ ఉండే, పక్కనే ఫైర్ ఇంజన్ కార్యాలయం, నిత్యం రద్దీ ఉన్న మదనపల్లి లాంటి పట్టణంలోనే ఇలాంటి ఘటనలు జరిగితే మరి గ్రామాలకు చివరలో ఉన్న తహసీల్దార్ కార్యాలయాల రికార్డులకు భద్రత ఎక్కడ ఉంటుందని అన్నారు. భూ కబ్జాదారులు ఎంతటి ఘాతుకానికైనా ఒడి కడతారని, రికార్డు రూములకు భద్రత పెంచాలని పేర్కొన్నారు.ఈ సమావేశంలో సిపిఐ మండల నాయకులు జీ.రఘునాథ్,ఎం.అష్రఫ్ అల్లి,ఎస్.తంబయ్యశెట్టి పాల్గొన్నారు.

సుండుపల్లి : మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో రికార్డులను కాల్చివేయడం దారుణమని జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు యనమల భగవాన్ సహాయ రెడ్డి విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో భూమి విలువ కోట్లల్లో ఉన్న ప్రాంతాలైన రాయచోటి, రాజంపేట, సుండుపల్లిలో కూడా వైసిపి నాయకులు అధికారులను లోబర చుకొని విపరీతమైన భూకబ్జాలు, రికార్డుల టాంపరింగ్, దొంగ రిజిస్ట్రేషన్లకు పాల్పడ్డారని అన్నారు. వాటిని కప్పి పుచ్చు కోవడానికి ఎంతటి ఘాతుకానికైనా దిగజారుతారని తెలిపారు. ఉన్నతాధికారులు అప్రమత్తమై అలాంటి ఘటనలకు చోటివ్వకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

ప్రజాశక్తి-రామాపురం

గ్రీవెన్స్ సెల్ కార్యక్రమాన్ని అన్ని గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ శ్రీనివాసులు పేర్కొన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ సెల్ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించరాదని తెలిపారు. రైతులు తమ గ్రామాల పరిధిలోని సమస్యలను తహశీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు. ప్రధా నంగా భూములకు సంబంధించిన అర్జీలు రైతులు అధికంగా ఫిర్యాదు చేశారన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ప్రభాకర్, విద్యుత్‌శాఖ ఇన్‌ఛార్జి వరప్రసాద్ రెడ్డి, ఎంఇఒ రామకృష్ణుడు, ఆర్ఐ రవికుమార్, అంగన్వాడీ సూపర్వైజర్ పద్మజ, అధికారులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టండి

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని నీలకంఠరావుపేట గ్రామ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు వాపోతున్నారు. గత మూడు సంవత్సరాల నుంచి రోడ్డు మరమ్మతుకు కంకర తోలి వదిలేసారని ఆ రోడ్డుపై వెళ్లాలంటే నరకం కనబడుతుందని వాపోతున్నారు. గత ప్రభుత్వంలో చేపట్టిన పని కావడంతో బిల్లులు వస్తాయో రావోనని గుత్తేదారులు పని మధ్యలో వదిలేశారని అన్నారు. గ్రామం నుంచి మండల కేంద్రానికి, అగ్రహారం, మూవిరెడ్డిపల్లి, గాలంగుండ్ల, అడపల మాలపల్లి, గాండ్లపల్లి గ్రామాల ప్రజలు, పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, వృద్ధులు, ద్విచక్రవా హనాలు, ఆటోలు వెళ్లాలంటే ఇబ్బందికరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్త ప్రభుత్వం మా గ్రామస్తుల బాధను అర్థం చేసుకొని త్వరితన మరమ్మతులు చేపట్టాలని కోరుకుంటు న్నారు.

స్త్రీనిధి రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-తంబళ్లపలి

స్త్రీనిధి రుణాలను మహిళా సభ్యులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని శ్రీనిధి మేనేజర్ అమరావతి కోరారు. సోమవారం స్త్రీశక్తి భవన్‌లో మహిళా సభ్యులకు ఆటో డెబిట్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్త్రీనిధి రుణాలు తీసుకున్న లబ్ధిదారులు ఇకపై తిరిగి చెల్లింపులను లబ్ధిదారుల పొదుపు ఖాతాలో జమ చేయాలని అన్నారు. ఆ ఖాతా నుంచి ఆటో డెబిట్ ద్వారా జమ చేసుకుంటామన్నారు. 2024 సంవత్సరానికి గాను రుణాలు బి కొత్తకోట మండలానికి రూ.3.5కోట్లు, ములకలచెరువు కు రూ.5.54 కోట్లు, పెద్దమండెం రూ.3.54కోట్లు, పెద్ద తిప్ప సముద్రం రూ.4.96కోట్లు, తంబళ్లపల్లి 4.52 కోట్ల రుణాలు పంపిణీ చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ఇప్పటికే మొలకలచెరువు మండలంలో రూ.2.81 కోట్లు, పెద్దమండ్యం రూ.1.11కోట్లు, తంబళ్లపల్లి లో రూ.60లక్షలు పంపిణీ చేసినట్లు చెప్పారు. గతంలో స్త్రీనిధి నుంచి తీసుకున్న రుణాల బకాయిలు పెద్దతిప్పసముద్రం రూ.32.36లక్షలు, తంబళ్లపల్లె రూ.11.11లక్షలు, పెద్దమండ్యం రూ.1.61, బి.కొత్తకోట ఒక లక్ష రూపాయలు, బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. లబ్ధిదారులు సకాలంలో తిరిగి చెల్లింపులు చేస్తే ఇతర సభ్యులకు రుణ సౌకర్యం కల్పించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. ఈ విషయాన్ని మహిళా సభ్యులు గుర్తించిసకాలంలో చెల్లించాలన్నారు. సమావేశంలో ఎపిఎం గంగాధర్, సిసిలు, సంఘమిత్రలు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

కుష్టు వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి-రామాపురం

చర్మంపై స్పర్శలేని మచ్చలు కుష్టువ్యాధి లక్షణాలు కావచ్చని వెంటనే గ్రామాల్లోకి వస్తున్న ఆరోగ్య కార్యకర్త కు చూపించాలని ఎంఎల్‌హెచ్‌పి తులసమ్మ పేర్కొన్నారు. మండలంలోని సరస్వతిపల్లె పంచాయతీ దళితవాడలో సోమవారం జాతీయ కుష్టువ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా కుష్టువ్యాధి లక్షణాలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పలువురిని పరీ క్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలలో ఈ నెల 18 నుంచి ఆగస్టు 2 వరకు కుష్టువ్యాధి లక్షణాలు ఉన్నవారిని గుర్తించే కార్యక్రమం నిర్వహిస్తున్నారని తెలిపారు. చర్మంపై స్పర్శ లేని మచ్చలు, మందమైనా మెరిసే జిడ్డుగల చర్మం బత్తాయి తొక్కలాగా ఉండడం, చెవులపై వీపుపై ఎదపై నొప్పిలేని బుడిపెలు, కనుబొమ్మలు కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం, ముక్కు దిబ్బడ, ముక్కులో రక్తం కారడం, కాళ్ల చేతులు తిమ్మిర్లు, అరచేతులు, అరికాళ్లలో స్పర్శ కోల్పోవడం, చల్లని, వేడి వస్తువులు గుర్తించలేకపోవడం, చేతుల నుంచి వస్తువులు జారిపోవడం, చేతి వేళ్ళు వంకర్లు తిరగడం లాంటి లక్షణాలు ఉన్నట్లయితే వెంటనే ఆరోగ్య కార్యకర్తను సంప్రదిం చాలని సూచించారు. కుష్టు వ్యాధికి సంబంధించిన మందులు ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఆరోగ్య కార్యకర్త వద్ద ఎండిటి మందులు ఉచితంగా లభిస్తాయని తెలిపారు. ప్రాథమిక దశలో మందులు వాడడం వల్ల అంగవైకల్యం నిర్మూలనకు సహరించాలని కోరారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి అందిస్తున్న క్లబ్ చైర్మన్ రమేష్‌నాయుడు

విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

లయన్స్ క్లబ్ ఆఫ్ రాజంపేట ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షులు నరసింహరాజు సహకారంతో సోమవారం శంకరాపురం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు క్రమశిక్షణ ఎంతో అవసరమని తెలిపారు. చిన్న వయసులోనే క్రమశిక్షణతో కూడిన జీవన విధానం అల వరచుకుంటే భవిష్యత్తులో ఉన్నత స్థితికి చేరుకోగలరని తెలిపారు. అనంతరం కేకు కోసి విద్యా ర్థులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు నరసింహారాజు, కార్యదర్శి పిడికిటి సంతోష్, షేక్ అబ్దుల్లా, పెనిగలపాటి చంద్రనాయుడు, ప్రధానోపాధ్యాయులు రాజేశ్వరి, ఉపాధ్యా యులు రమణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-పుల్లంపేట

పుల్లంపేట మండల పరిధిలోని అనంతంపల్లె, రెడ్డిపల్లిపేట, రెడ్డిపల్లె రైల్వే స్టేషన్, రెడ్డి పల్లె పెట్రోల్ బంక్ బ్యూటీ పరిసర ప్రాంతాలలో 33 కెవి,11 కెవిలైన్‌లకు మరమ్మతులు కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరా ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్‌ను నిలుపుదల చేస్తున్నట్లు ఎఇ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న విభిన్న ప్రతిభావంతులు

స్మిత సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఐఎఎస్ స్మిత సబర్వాల్‌పై యుపిపిఎస్‌సి చర్యలు తీసుకోవాలని రాజంపేట విభిన్న ప్రతిభావంతుల సేవా సంఘం అధ్యక్షులు అబ్దుల్‌ఖాదర్ డిమాండ్ చేశారు. సోమవారం మన్నూరు లోని దివ్యాంగుల సేవా సంఘం కార్యాలయంలో వారు పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ స్మిత సబర్వాల్ దివ్యాంగులకు రిజర్వేషన్ అవసరం లేదనడం తమను తీవ్రంగా బాధించిందని తెలిపారు. పరిపాలన చేయడానికి శరీరాకృతి, అందం అవసరం లేదని, తెలివితేటలు, పరిపాలన విజ్ఞత కావాలని అవి దివ్యాంగులకు పరిపుష్టిగా ఉన్నాయని తెలిపారు. దివ్యాంగులకు రోస్టర్ పాయి ంట్ 56 ఉండడం వలన ఇప్పుడే ఉద్యోగాలు పొందలేక ఆవేదన చెందుతున్నారని, ఈ సమయంలో స్మిత సబర్వాల్ పుండుపై కారం చల్లినట్లుగా తమను కించపరచిన స్మిత పై సెక్షన్ 92 ప్రకారం నాన్ బెయిల్ వారెంట్ జారీచేయాలని, లేదా ఆమె దివ్యాంగ లోకానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పుల్లంపేట విభిన్న ప్రతిభావంతుల సేవా సంఘం అధ్యక్షులు మల్లు సుబ్బ నరసారెడ్డి, ఉపాధ్యక్షులు ఖాదర్ బాషా, కోశాధికారి నరసింహులు, సభ్యులు ప్రసాద్, ఓబయ్య పాల్గొన్నారు.

సంచార ఆధార్ సెంటర్లు ఏర్పాటు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలో మంగళవారం నుంచి సంచార ఆధార్ సెంటర్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపిడిఒ కార్యాలయ ఎఒఆనంద్ కుమార్ తెలిపారు. 23న కొట్టాల గ్రామ సచివాలయంలో, కన్నిమడుగు గ్రామ సచివాలయం లో, 25న తంబళ్లపల్లి -1, గ్రామ సచివాలయంలో, 26న రేణుమాకులపల్లి గ్రామ సచివాలయ కేంద్రాలలో ఆధార్ కార్డు సంబంధిత సేవలను పొందగలరని తెలి పారు. 0-5 సంవత్సరాల పిల్లలకు బాల ఆధార్‌కార్డు ఉచితంగా చేస్తారని పేర్కొన్నారు. బయోమెట్రిక్ అప్ స్టేషన్ కొరకు వంద రూపాయలు చెల్లించాలని తెలిపారు. ఆధార్ కార్డ్ పేరు లేదా పుట్టిన తేదీ మార్పు కొరకు వారి సంబంధిత పదవ తరగతి మార్క్ లిస్ట్ లేదా జనన ధ్రువీకరణ పత్రం, తగిన పత్రాలతో హాజరుకావాలని కోరారు. మీ ఆధార్ కార్డు చిరునామా మార్పు కోసం గెజిటెడ్ ఆఫీసర్ సంతకం చేసుకుని హాజరుకావాలని తెలిపారు.

మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధిగా వడ్డే హరి

ప్రజాశక్తి-కలికిరి

మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధిగా కలికిరికి చెందిన వడ్డే హరిని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం తిరుపతిలోని యూత్ హాస్టల్‌లో రాష్ట్ర మాల మహానాడు రాష్ట్ర కమిటీ సమావేశం అధ్యక్షుడు డాక్టర్ ఎం.లాసుదర్శన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో రాష్ట్ర అధికార ప్రతినిధిగా వడ్డే హరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా హరి మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి అధికారి ప్రతినిధిగా ఎన్ను కున్నందుకు రాష్ట్ర అధ్యక్షులు, మాల మహానాడు సభ్యు లకు కృతజ్ఞతలు తెలిపారు. మాల మహానాడు అభి వృద్ధికి నావంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్య క్రమంలో మాల మహానాడు మండల అధ్యక్షుడు భాను ప్రకాష్, రాయలసీమ విద్యార్థి విభాగం నాయకుడు మాలతోటి నరేష్, మండల కమిటీ మెంబర్ గుం డ్లూరు విజయ్ కుమార్, రెడ్డిప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సహదేవ, జాతీయ,రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.


హరిని అభినందిస్తున్న సుదర్శన్

మహారాజశ్రీ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, కదిరి
O.S.NO:310/2021

Between:
1.సోమగుట్ట శంకరరెడ్డి,
2.సోమగుట్ట రవింద్రారెడ్డి,
3.సోమగుట్ట నాగేంద్ర కుమార్ రెడ్డి,
4.సోమగుట్ట రాములమ్మ,
5.సోమగుట్ట లక్ష్మిదేవి,
6.సోమగుట్ట శోభారాణి ...వాదులు

మరియు

మబ్బురెడ్డి శేఖరరెడ్డి మరియు ఇతరులు ...ప్రతివాదులు

8వ ప్రతివాదికి దావా నోటీసు

To,
D8:మబ్బు లక్ష్మిదేవి W/o బసిరెడ్డి, D/o ఎమ్.వెంకటరమణారెడ్డి, దండువారిపల్లి, మొలకల చెరువు మండలం, అన్నమయ్య జిల్లా.

అను మీపైన, వాదులు అయిన సోమగుట్ట శంకరరెడ్డి మరియు ఇతరులు తమ ఆస్తుల భాగ పరిష్కార నిమిత్తం పై వారి కోర్టు నందు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావా మీ హాజరు నిమిత్తం పై వారి కోర్టు నందు 09/08/2024 వ తేదికి వాయిదా ఉన్నది. సదరు వాయిదా తేదిన ఉదయం 10:30 గం॥లకు పై వారి కోర్టు నందు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. అట్లు హాజరు కాని యెడల మీ పరోక్షమున తీర్మానించెదరని ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:09/08/2024
స్థలం:కదిరి

వి.ప్రసాద్ రెడ్డి, బి.ఎ.,బి,ఎల్.
వాదులపరం వకీలు, కదిరి.

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, కదిరి
I.A.NO:378/2022 in I.A.NO:357/2022 in I.A.NO:358/2022 O.S.NO:228/2014

Between:
సయ్యద్ అబ్దుల్లా S/o ఖాదుసాబ్ D.No:4-605, కుమ్మరవాండ్లపల్లి, కదిరి, శ్రీ సత్యసాయి జిల్లా. ...పిటీషనర్/వాది

మరియు

సయ్యద్ గౌస్ సాబ్ @ హట్టు గౌస్ సాబ్ మరియు ఇతరులు ...రెస్పాండెంట్స్/ప్రతివాదులు

To,
R7:సయ్యద్ హస్మత్ W/o లాలుసాబ్, కందూరు,సోమాల మండలం, అన్నమయ్య జిల్లా.
R8:సయ్యద్ రేష్మా D/o లాలుసాబ్, ప్రైవేట్ టీచర్, కందూరు, సోమల మండలం, అన్నమయ్య జిల్లా.

7 మరియు 8 రెస్పాండెంట్స్‌లకు నోటీసులు

పై అర్జీలలో పై కోర్టు వారు మీ హాజరు నిమిత్తం 16/08/2024 వ తేదికి వాయిదా వేసినారు. కావున మీరు 16/08/2024 వ తేదిన ఉదయం 10:30 గం॥లకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టు వారి ఎదుట హాజరు కావలెను. అట్లు హాజరు కాని పక్షంలో పై అర్జీలను మీ పరోక్షమున తీర్మానించెదరని ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:16/08/2024
స్థలం:కదిరి

ఎ.పి.సిద్ధార్థసాయికుమార్ రెడ్డి, బి.ఎ., ఎల్.ఎల్.బి,
పిటీషనర్ తరుపు వకీలు, కదిరి.

మహారాజశ్రీ రాజంపేట ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
I.A.No :182/2016
O.S.No :109/2016

కొండేటి గిరిధర్ బాబు, తండ్రి రామయ్య, నరసరాంపేట, రైల్వే కోడూరు టౌన్ & మండలం, అన్నమయ్య జిల్లా. ...పిటిషనర్/వాది

V/s

R1.చెంగలగారి సిద్దయ్య, తండ్రి వెంకటయ్య, ఇతను చనిపోయినందున ఇతని వారసులు
R5. చంగలగారి శంకరయ్య, తండ్రి సిద్దయ్య
R6. చెంగలగారి ఉమామహేష్ తండ్రి సిద్దయ్య.
పై ఇరువురు రాఘవరాజుపురం గ్రామం మరియు పోస్ట్, రైల్వే కోడూరు మండలం, అన్నమయ్య జిల్లా నందు నివాసం. ...5 మరియు 6 రెస్పాండెంట్లు/ప్రతివాదులు

పై వాది, 5 మరియు 6 ప్రతివాదులైన మీపై మరియు ఇతరులపై పర్మినెంట్ ఇంజక్షన్ కోరి దావా ధాఖలు చేసి ఉన్నారు మరియు షెడ్యూల్ ధాఖల అస్థిని అనుభవవించుటకు ఆక్షేపణ చేయకూడదు అని I.A.No.186/2016 అను పిటిషన్ ధాఖలు చేసారు. చేసియున్నారు. సదరు విషయమై మీకు ఏవైనా ఆక్షేపణలు ఉన్న యెడల మీరుగాని, మీ వకీలు గారి ద్వారా గాని 02-08-2024వ తేదీన ఉదయం 10:30 గంటలకు గౌరవ రాజశ్రీ వారి కోర్టులో హాజరై మనవి చేసుకొనవలయును. లేనంతట మీ పరోక్షమున తీర్మానించబడునని తెలపడమైనది.

//బై ఆర్డర్ ఆఫ్ ది కోర్టు//

పి. వల్లభరావు,
వాదిపరం వకీలు, రాజంపేట.

CASE SUMMONS
IN THE COURT OF THE HON'BLE JUDICIAL MAGISTRATE OF FIRST CLASS: VENKATAGIRI
C.C. No.161 OF 2022

Devalla Krishna Murthy .... Complainant
VS
Thambichetty Ramaiah ...Accused

SUMMONS TO ACCUSED BY WAY OF SUBSTITUTE SERVICE

Thambichetty Ramaiah, S/o T.Venkataswamy, ASI, Prohibition & Excise police station, Piler, Annamayya District. Residing at D.No.1-426/3, Synik nagar, Piler, Annamayya District.

Whereas the Complainant has instituted a case against you, you are hereby summoned to appear in the court in person or by a pleader duly instructed and able to answer all material questions relating to the case or who shall be accompanied by some other person able to answer all such questions on the date 09-08-2024 at 10:30 am., in the forenoon answer the claim and you are directed to produce on that day all the documents upon which you intend to rely in support of defence. Take summons that in default of your appearance on the day above mentioned, the case will be heard and determined in your absence.

Hearing date: 09-08 -2024

V.CHENCHU KRISHNAIAH,
ADVOCATE , VENKATAGIRI,
CONTACT NO:9985398129.